ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
శనివారం 1 ఫిబ్రవరి 2025



నేటి నుంచి ధరల పెంపు

- భూముల మార్కెట్ వాల్యూ పట్టణాల్లో 10 నుంచి 20 శాతం..
- జాతీయ రహదారులు, రింగ్‌రోడ్ల వద్ద 15-40 శాతం పెంపు
- అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అమలు


కిటకిటలాడుతున్న కడప రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం



కడప కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భూముల ధరల పెంపునకు మూడు నెలలుగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. భూముల ధరలు పెంచే ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కలియతిరిగారు. ఎట్టకేలకు సమష్టిగా భూముల ధరల పెంపు కసరత్తు పూర్తిచేశారు. జగన్ సర్కారులో స్పెషల్ రివిజన్ పేరుతో మూడుసార్లు అశాస్త్రీయంగా పెంచిన భూముల ధరలను కూటమి ప్రభుత్వంలో బ్యాలెన్స్ చేశారు. పెంచిన ధరలు శనివారం నుంచి అమలు జరిగేలా ప్రభుత్వం రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని పట్టణ, నగర ప్రాంతాల్లో 10 నుంచి 20 శాతం వరకు భూముల ధరలు పెంచారు. ఏళ్ల తరబడి జాతీయ రహదారులు, రింగ్ రోడ్ల చుట్టుపక్కల ఎకరం ధర రూ.10-20 లక్షలకు దాటలేదు. ఈ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు పుంజుకోవడంతో బహిరంగ మార్కెట్‌లో ఈ భూముల ధరలు రూ.5-10 కోట్లుగా ఉన్నా.. రిజిస్ట్రేషన్ల సమయంలో పాత ధరలకే స్టాంపు డ్యూటీ చెల్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలాంటి భూముల ధరలను 15 నుంచి 40 శాతం వరకు పెంచినట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాల్లో ఎకరం ధర కేవలం రూ.70 వేల నుంచి రూ.లక్షకు మించకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఈ భూములపై కూడా 40 శాతం ధరలు పెంచక తప్పలేదని అధికారులు చెబుతున్నారు.

కిటకిటలాడిన రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

శనివారం నుంచి కొత్త మార్కెట్ వాల్యూ అమల్లోకి రానుండడంతో రెండు రోజులుగా క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎగబడ్డారు. దీంతో జిల్లాలోని 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు శుక్రవారం జనంతో కిటకిటలాడాయి. పెరిగిన ధరలు అమలులోకి వస్తే స్టాంపు డ్యూటీ భారం పడుతుంది. దీంతో గతంలో రాసుకున్న అగ్రిమెంట్ కాగితాలను పట్టుకొని రిజిస్ట్రేషన్లకోసం పెద్దఎత్తున శుక్రవారం కడప అర్బన్, రూరల్ కార్యాలయాలకు చేరుకున్నారు. వారం రోజులుగా సర్వర్ స్లోగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ అధికారులు రాత్రివరకు కార్యాయాల్లో ఉండి క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తూ.. మరోపక్క పెంచిన ధరలకు సంబంధించిన డేటా ఎంట్రీలో బిజీబిజీగా ఉన్నారు. శుక్రవారం రాత్రికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు హెచ్చరికలు చేశారు.

రిజిస్ట్రేషన్ రాబడి రూ.700 కోట్లు?

జిల్లాలో 12 రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల ద్వారా ఏటా రాబడి టార్గెట్ రూ.600 కోట్లు ఉండేది. రియల్ భూమ్ ఉన్నా లేకున్నా ప్రజల అవసరాలకు తగ్గట్లుగా జరిగే క్రయవిక్రయ రిజిస్ట్రేషన్ల వల్ల ఏడాదికి సగటున రూ.500 కోట్ల ఆదాయం వచ్చేది. ఈ దఫా భూముల రిజిస్ట్రేషన్ వాల్యూ పెంపుతో.. ప్రభుత్వానికి అదనంగా దాదాపు రూ.700 కోట్ల ఆదాయం సమకూరనుందని అంటున్నారు.

ధరల పెంపు ఇలా..

కడప అర్బన్ పరిధిలో.. నగరంలోని వైవీ స్ట్రీట్‌లో గతంలో చదరపు గజం ధర రూ.65 వేలుగా ఉంటే, దానిని రూ.76 వేలకు పెంచారు. ఎన్జీవో కాలనీలో రూ.17,800ల నుంచి రూ.20,500 వరకు, మద్రాసు రోడ్డులో రూ.43,200 ధరను రూ.47,600కు, బళ్లారి రోడ్డులో రూ.11.100గా ఉన్న చదరపు గజం ధరను రూ.12,800కు పెంచారు.

రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో.. చెమ్మూమియాపేటలో ఎకరం ధర రూ.44 లక్షలుండగా ఇప్పుడు రూ.55 లక్షలకు చేరుకుంది. గూడూరు పొలంలో రూ.90 లక్షల నుంచి రూ.95 లక్షలకు, చెన్నూరు మండల పరిధిలో ఎకరం ధర రూ.6.40లక్షల నుంచి రూ.8.20 లక్షలకు, మరికొన్ని పల్లెల్లో రూ.13.50 లక్షలుగా ఉన్నా భూముల ధరలు రూ.18 లక్షల వరకు పెంచారు. ఇదే పద్ధతిన జిల్లావ్యాప్తంగా 2019 తరువాత పల్లె పట్నం అనే తేడా లేకుండా భూముల ధరలు పెంచడం ఇదే మొదటిసారి అని అధికారులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు పుంజుకుంటే స్టాంపు డ్యూటీ రుసుం కింద ఈ దఫా జిల్లాలో రూ.700 కోట్ల వరకు ప్రభుత్వ ఖజానాకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.





సింహవాహనంపై తిరుమలేశుడు

- కనులపండువగా కడపరాయుడి బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 8గంటలకు తిరుమలేశుడు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మాఢవీధుల్లో ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై ఇరువురు దేవేరులతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఊరేగింపులో చెక్కభజన కళాకారులు, కోలాటం కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, కృష్ణమూర్తి, తరుణ్ సారథ్యంలో మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామివారు మాఢవీధుల్లో విహరించారు. అంతకు ముందు ఉదయం 9గంటలకు వెంకటేశ్వరుడు దివ్య మంగళ స్వరూపుడై చిన్న శేష వాహనంపై మాఢవీధుల్లో ఊరేగారు. 10.30గంలకు స్వామివారికి స్నపన తిరుమంజనం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు శ్రీవారికి ఊంజల్ సేవ, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డితో పాటు ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



సభ నుంచి వెళ్లిపోతున్న చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి

వైసీపీకి షాక్..!

- మున్సిపల్ సమావేశం నుంచి.. అర్ధంతరంగా వెళ్లిన చైర్‌పర్సన్
- నిరసన తెలిపిన టీడీపీ కౌన్సిలర్లు
- తాత్కాలిక చైర్మన్‌గా మురళీధర్‌రెడ్డి ఎన్నిక
- కొనసాగిన సాధారణ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి బడ్జెట్ సమావేశం ముగియగానే అర్ధంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోయారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు తాత్కాలికంగా 5 వవార్డు కౌన్సిలర్‌ను చైర్మన్‌గా ఎన్నుకుని ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించి అజెండాపై చర్చించి పలు అంశాలను తిరస్కరిస్తూ తక్కిన అంశాలను ఆమోదించారు. ఈ అనూహ్య పరిణామం వైసీపీకి షాక్ ఇచ్చినట్లయింది. వివరాలిలా..

మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు, మున్సిపల్ సాధారణ సమావేశం 11.30 గంటలకు నిర్వహించాల్సి ఉంది. 10,30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్‌కు వైసీపీ కౌన్సిలర్లతో సహా చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి హజరయ్యారు. ఆమె అధ్యక్షతన బడ్జెట్ మీద సమావేశం ప్రారంభించారు. కాగా.. పూర్తిస్థాయిలో చర్చ జరపకుండానే ఆమె బడ్జెట్ అజెండాను ఆమోదించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆమెతో పాటు వైసీపీ కౌన్సిలర్లు వెళ్లిపోయారు. ఎందుకు వెళుతున్నారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రశ్నించినా చైర్‌పర్సన్ సమాధానం ఇవ్వకుండానే వెళ్లిపోయారు. మున్సిపల్ సాధారణ సమావేశం జరపకుండానే చైర్‌పర్సన్ వెళ్లిపోవడంపై టీడీపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్లు మున్సిపల్ సాధారణ సమావేశం జరుపుకోవడానికి కమిషనర్ మల్లికార్జునను రూల్ పొజిషన్‌పై వివరణ కోరారు. కోరం ఉంటే తాత్కాలిక చైర్మన్‌ను ఈ సమావేశం వరకు ఎన్నుకుని సభను నిర్వహించుకోవచ్చని ఆయన తెలిపారు. దీంతో ఎమ్మెల్యే సూచనలతో టీడీపీ కౌన్సిలర్లు 5 వవార్డు కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నుకుని ఆయన అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. వార్డులలో సమస్యలపై చర్చించారు. మొత్తం 48 అంశాలున్న అజెండాలో 6 అంశాలను తిరస్కరిస్తూ తక్కిన అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. సమావేశం ముగింపు సందర్భంగా సాధారణ సమావేశానికి హజరైన కౌన్సిల్ సభ్యులతో మినిట్స్ బుక్‌లో సంతకాలు ఎందుకు చేయించలేదని మూడవ వార్డు టీడీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీ భర్త రామాంజనేయరెడ్డి కమిషనర్‌ను, అధికారులను దుర్భాషలాడారు. రామాంజనేయరెడ్డి కౌన్సిల్ సమావేశంలోకి ఎలా వచ్చారు, తమను ఎందుకు దూషిస్తారంటూ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కౌన్సిల్ సభ్యులంతా కమిషనర్‌కు సర్దిచెప్పడంతో ఆయన శాంతించారు.


చైర్‌పర్సన్ తీరును తప్పుపడుతూ నిరసన తెలుపుతున్న టీడీపీ కౌన్సిలర్లు

వర్రా కేసులో ఇద్దరిని విచారించిన పోలీసులు

- పోలీసులకు చిక్కిన ముఖ్య సమాచారం
- త్వరలో కీలక వ్యక్తులకు నోటీసులు

పులివెందుల టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో పెట్టిన అసభ్య పోస్టులకు సంబంధించి అరెస్టు అయిన వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి కేసులో పోలీసులు మరో ఇద్దరిని విచారించారు. మాజీ ఏపీ డిజిటల్ కార్పొరేషన్ డైరెక్టర్ సీవీ రెడ్డి, మాజీ వైసీపీ సోషల్ మీడియా డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డిని శుక్రవారం కడప సైబర్ సెల్ పోలీసు స్టేషన్‌లో విచారించారు. ఈ మేరకు వారి నుంచి కీలక సమాచారాన్ని సేకరించామని పులివెందుల డీఎస్పీ మురళీ తెలిపారు. వారిద్దరూ ఇచ్చిన సమాచారాన్ని రికార్డు చేశామని రెండుమూడు రోజుల్లో కీలక వ్యక్తులకు నోటీసులు ఇచ్చి త్వరలో ఈ కేసు విచారణ పూర్తి చేస్తామన్నారు. ఈ కేసును వేగవంతం చేసేందుకు ఎస్పీ ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారన్నారు. ఈ కేసులో 28 మందికి 41-ఏ నోటీసులు ఇచ్చామని, 78 మందికి గాను 48 మందిని విచారించి పదిమందికి పీటీ వారెంటు ఇచ్చామని, ముగ్గురిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. ప్రత్యేక టీం సహకారంతో విచారణ పూర్తి చేసి ఈ కేసులో సంబంధం ఉన్న వ్యక్తులను అరెస్టు చేస్తామన్నారు.

నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత కోసం పేదలకు ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు శనివారం పంపిణీ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. పింఛన్ పంపిణీదారులు తమకు సంబంధించిన సచివాలయాల పరిధిలో శనివారం ఉదయం 6గంటలకు అందుబాటులో ఉండాలని అధికారులు సూచించారు. జనవరికి సంబంధించి 2,57,485 మందికి రూ.110.58కోట్లు మంజూరైంది. మొదటిరోజే 99శాతం పింఛన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలు, కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

గండికోట పర్యాటక మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఒబెరాయ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ సహార్



గండికోటలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గండికోటలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, మరో వైపు ఒబెరాయ్ సంస్థ ఆతిథ్య సేవల కోసం సిద్ధమవుతోందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో గండికోట పర్యాటకం, ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ సహార్, సంబంధిత ప్రాజెక్టు అభివృద్ధి ఏజెన్సీలతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాచీన పర్యాటక ప్రాంతమైన గండికోటకు అతి సమీపంలో జాతీయ రహదారులు, రైలు మార్గాలు, విమానయాన రవాణా సదుపాయాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే గండికోట డెవలప్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేందుకు ఆధునాతన, విలాసవంతమైన స్టార్ హోటళ్ల సముదాయాన్ని ఏర్పాటు చేసేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రణాళికలు రూపొందించిందన్నారు. హెలిప్యాడ్, రిసార్ట్, భవనాలు, వ్యూ పాయింట్స్, వివిధ రకాల క్రీడా ప్రాంగణాలు, జిమ్, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్, చిల్డ్రన్ ప్లే జోన్, లైటింగ్, రిజర్వాయర్‌లో వాటర్ జెట్టీలు, బోటింగ్ వంటి సదుపాయాల ఏర్పాటుకు సంబంధించి రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒబెరాయ్ వైస్ ప్రెసిడెంట్ వివరించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, తహశీల్దారు శ్రీనివాసరెడ్డి, ఏపీటీడీసీ ఎస్.ఈ ఈశ్వరయ్య, ఎస్టేట్ ఆఫీసరు రాంప్రసాద్, జిల్లా టూరిజం అధికారి సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఏడాది వరకు గడువు

- జగన్ అనాలోచిత నిర్ణయంతో.. పేదల గృహనిర్మాణాల నత్తనడక
- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వేగవంతానికి చర్యలు
- వంద రోజుల ప్రణాళికలో 2,380 ఇళ్ల నిర్మాణం పూర్తి
- 2026 మార్చి వరకూ గడువు పొడిగింపు


కడప నగర శివారులోని టిడ్కో ఇళ్ల సమీపంలో లేఅవుట్‌లోని సొంత స్థలంలో పూర్తయిన నిర్మాణం

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా జిల్లాలో చేపట్టిన పక్కాగృహాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. జగన్ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80లక్షలు మాత్రమే ఇచ్చారు. ఆ సొమ్ముతో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. నాటి జగన్ అనాలోచిత నిర్ణయం కారణంగా.. అప్పట్లో ఎంపికై ఆ తక్కువ సొమ్ముతో ఇల్లు కట్టుకోలేకపోయిన వారికి భవిష్యత్తులో మళ్లీ ఇల్లు రాని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా పీఎంఏవై-1కింద మంజూరైన ఇళ్లను ఈ ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తిచేయాల్సి ఉంది. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు పెద్దగా సుముఖంగా లేకపోవడంతో వాటి గడువు 2026 మార్చి నెల చివరి వరకు ప్రభుత్వం పొడిగించింది. లబ్ధిదారులకు ఇది కాస్త ఊరట కలిగించే అంశం.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత.. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. వంద రోజుల గృహ నిర్మాణాల ప్రణాళికను రూపొందించింది. రాష్ట్ర వ్యాప్తం గా వంద రోజుల్లో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి నేరుగా లబ్ధిదారులకు పూర్తి అయిన ఇంటి తాళాన్ని అందించేందుకు, ఫిబ్రవరి 1న గృహప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా గృహప్రవేశాలు వాయిదా పడ్డాయి. ఇక వంద రోజుల ప్రణాళికలో జిల్లాలోని లేఅవుట్లలో ఇప్పటికే 2,320 ఇళ్లు పూర్తయితే సొంత స్థలాల్లో 1,224 ఇళ్లు పూర్తి చేశారు.

సాగుతున్న నిర్మాణాలు

జగన్ హయాంలో జిల్లాలో 89,884 పక్కాగృహాలు మంజూరయ్యాయి. ఊరికి అవతల లేఅవుట్లు వేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఇచ్చే నిర్మాణ వ్యయాన్ని రూ.1.80లక్షలకే కుదించారు. అప్పట్లో ఇసుక సరిగా దొరకకపోవడంతో పాటు నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలను వేగవంతం చేసింది. అయినా సరే.. లేఅవుట్లలో సరైన వసతులు లేకపోవడంతో ఇల్లు కట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. అలాంటి వారికి అధికారులు అవగాహన కల్పించారు. ఇప్పుడు కట్టుకోకపోతే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇల్లు మంజూరు కాదని వివరించారు. ఎంతో వత్తిడి చేయడంతో మంజూరైన వాటిలో 36,571 ఇళ్లను పూర్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80లక్షలతో పాటు స్వయంసహాయక సంఘాల గ్రూపులో ఉన్న మహిళలకు రూ.35వేలు రుణం ఇప్పిస్తున్నారు. ఇక ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారులకు లేఅవుట్లలో ఇళ్లనిర్మాణాన్ని అప్పట్లోనే కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే ఈ పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే నిలిపివేశారు. తిరిగి వారందరితో కూటమి ప్రభుత్వం నిర్మాణ పనులు చేపట్టింది.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి..



ఇల్లు మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారుడు నిర్మాణాలను పూర్తి చేసు కోవాలి. ఇప్పుడు ఈ స్కీంలో మంజూరైన వారు నిర్మాణం చేపట్టకపోతే భవిష్యత్తులో వారికి ఇల్లు మంజూరు కాదు. ప్రభుత్వం కూడా వచ్చే ఏడాది మార్చి నెల చివరి వరకు గడువు ఇచ్చింది. లేఅవుట్లలో రోడ్లు, నీరు, విద్యుత్ ఇతర మౌలిక వసతులను కల్పిస్తాం.

- వేమా రాజారత్నం, హౌసింగ్ పీడీ



నియోజకవర్గం	నిర్మాణంలో	బీబీఎల్	బీఎల్	ఎల్ఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తి
బద్వేలు	10,529	273	2,083	76	1,189	1,544	5,364
మైదుకూరు	7,829	158	1,159	67	604	995	4,846
ప్రొద్దుటూరు	18,464	1,153	980	136	226	2,566	3,303
జమ్మలమడుగు	8,784	320	2,268	58	807	208	5,163
పులివెందుల	16,488	688	2,733	206	2,799	2,946	7,116
కమలాపురం	4,783	214	681	46	541	278	3,023
కడప	21,170	513	11,418	206	1,513	886	6,634
సిద్దవటం.. ఒంటిమిట్ట	1,837	53	354	26	196	46	1,162
మొత్తం	89,884	3,372	29,776	821	9,875	9,469	36,571

ఎస్‌ఐ, సీఐలు రిమాండ్‌కు


మీడియాతో మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి

రామసముద్రం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): లారీ ప్రమాదం కేసులో సీజ్ చేసిన లారీని విడిపించేందుకు లారీ ఓనర్ నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన రామసముద్రం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యను ఇందులో ప్రమేయం ఉన్న సీఐ రమేష్‌లను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి తెలిపారు. ఇందులో ఏ1గా ఎస్‌ఐ, ఏ2గా సీఐ ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కేసుకు సంబంధించి గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ, సీఐలతో పాటు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడును ఏసీబీ అధికారులు విచారణ చేశామన్నారు. కాగా మదనపల్లెలోని ఎస్‌ఐ, సీఐ ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మండలంలోని పోలీస్‌స్టేషన్‌లోకి మీడియాతో పాటు ఎవరినీ అనుమతించ కపోవడంతో ఏం జరుగుతోందని ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- క్లస్టర్ కేంద్రంగా విద్యా కార్యక్రమాలు
- డీఈవో సుబ్రమణ్యం, డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

సంబేపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు తోడ్పాటును అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డిలు సూచించారు. శుక్రవారం సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో వారు మాట్లాడారు. సంగ్రహణాత్మక పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించి వెనుకబడిన వారు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎస్సీఈఆర్టీ రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. సంబేపల్లెలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూ తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామూళ్ల మద్యం..!



తక్కువ ధరకే నాణ్యమైన మద్యం ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అయితే మద్యం విక్రయాల్లో షాపు యజమానులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. పట్టణాలు, పంచాయతీల్లో షాపులకు అనుబంధంగా అనధికార సిట్టింగ్ గదులు, గ్రామాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. బార్లను తలపించేలా వ్యాపారాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండడంతో నడిరోడ్డుపై మద్యం తాగుతున్నా అటువైపే చూడడం లేదు. చిల్లర దుకాణాల్లోనూ మందుబాబులు మత్తులో తూగుతున్నారు.

- తెగ తాపిస్తున్నారు..!!
- షాపులే బార్లలా..
- పల్లెపల్లెకూ బెల్టు.. అటు చూస్తే ఒట్టు
- తాట తీలేదు.. బెల్టూ తీలేదు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్


మద్యం షాపునకు అనుబంధంగా నడుస్తున్న అనధికార సిట్టింగ్

మదనపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ‘మద్యం షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూములు పెట్టినా, పల్లెల్లో ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా తాట తీస్తా.. బెల్టు తీస్తా.. అలా ఎవరైనా చేస్తే మొదటి విడతగా కేసు నమోదు చేస్తాం. అదే వ్యక్తి రెండోసారి పట్టుబడితే మద్యం షాపు లైసెన్సు కూడా రద్దు చేస్తా’మని ఎక్సైజ్‌శాఖ మంత్రి నుంచి సీఎం చంద్రబాబునాయుడు వరకూ చెబుతున్న మాటలివీ. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్టోబరు 15న కొత్తమద్యం పాలసీతో దుకాణాలు అమలులోకి వచ్చాయి. కానీ పట్టణమే కాదు.. పల్లెల్లోనూ మద్యం పాలసీగానీ, సీఎం ఆదేశాలు కానీ ఎక్కడా అమలు కాలేదు. పట్టణాలు, పంచాయతీల్లో షాపులకు అనుబంధంగా అనధికార సిట్టింగ్ గదులు, గ్రామాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. ఓ విధంగా చెప్పాలంటే.. పట్టణాల్లో షాపులే బార్లు లాగా మార్చి తెగతాపిస్తుండగా, షాపునకు అనుబంధంగా ఉన్న పల్లెలకూ మద్యం సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లో మాత్రం ఎంఆర్‌పీ ధరలకే విక్రయిస్తుండగా, బెల్టు షాపుల్లో మాత్రం క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. పట్టణంలో ఒక్కోషాపు 400 చ.అ. విస్తీర్ణంలో ఉంటే, దానికి అనుబంధంగా అంతకు పదింతులు, వందరెట్ల విస్తీర్ణంలో సిట్టింగ్ గదులు, హాలులు ఏర్పాటు చేశారు. కొందరైతే గోదాము తరహాలో పైన రేకులు, కూర్చోడానికి బల్లలు, నిర్మాణ దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు అక్కడే తాగి, అక్కడే తూగుతూ నిద్రపోవడానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించారు.

జిల్లాలో పెద్ద పట్టణంగా పేరున్న మదనపల్లె మున్సిపాలిటీలో మద్యం దుకాణాలు బార్లను తలపిస్తున్నాయి. షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూములు ఏర్పాటు చేసి తెగ తాపిస్తున్నారు. పట్టణంలో పది దుకాణాలు, తిరుపతిరోడ్డు, బెంగళూరురోడ్డు, పుంగనూరురోడ్డుతో పాటు సీటీఎంతో కలిపి మొత్తం 14 మద్యం షాపులు ఉన్నాయి. వీటిలో మూడు, నాలుగు షాపులు మినహా అన్నింటిలోనూ సిట్టింగ్ సౌకర్యం కల్పించి తాపిస్తున్నారు. అలాగే మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మొత్తం 22 దుకాణాలు ఉండగా, అందులో మిగిలిన రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో ఒక్కొక్కటి, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో మూడు చొప్పున మొత్తం ఎనిమిది దుకాణాలు ఉన్నాయి. వీటిలోనూ మదనపల్లె తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి.

ఇక్కడ ప్రతిచోటా షాపులు, సిట్టింగ్ రూముల వద్ద మద్యం ప్రియులకు చికెన్, చేప, గోడిగుడ్డు, ఇతర ఐటమ్స్ కూడా అక్కడే అందుబాటులో ఉంచారు. కొందరు అక్కడే బహిరంగంగా తాగేసి వెళ్లిపోతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన ఎక్సైజ్, సివిల్ పోలీసులు దుకాణాల నుంచి నెలవారి మామూళ్లు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. మదనపల్లెలో ఒక్కో దుకాణం నుంచి ఏరియాను బట్టి నెలకు రూ.40 వేల నుంచి 50 వేలు వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అలాగే మదనపల్లె ఎక్సైజ్ పరిధిలోని అంగళ్లు, బి.కొత్తకోటతో పాటు ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ములకలచెరువులో రూ.30వేలు, మిగిలిన మండలాల్లో వ్యాపారాన్ని బట్టి రూ.15వేల నుంచి రూ.20వేలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని ఎక్సైజ్, సివిల్ పోలీసుల పేరుతో వసూలు చేస్తున్నట్లు దుకాణదారులే బహిరంగంగా చెబుతున్నారు. అయితే ఈ విధానాన్ని ఇద్దరు లేదా ముగ్గురు షాపుల యజమానులు తిరస్కరించిన్నట్లు తెలిసింది. ఇదిలా వుండగా, పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, తదితర శివారు ప్రాంతాల్లోని చిన్నచిన్న హోటళ్లతో పాటు జాతీయ రహదారుల వెంట ఉన్న కొన్ని డాబాల్లోనూ మద్యం తాగడానికి అనుమతిస్తున్నారు. మద్యం లేనిదే వ్యాపారం ఉండదన్నట్లుగా నిర్వాహకులు భావిస్తున్నారు.

మదనపల్లె, ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, పెద్దమండ్యం మండలాల పరిధిలో మొత్తం 32 దుకాణాలు ఉన్నాయి. అయితే అన్ని గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో సంపూర్ణంగా మద్యం దొరుకుతోంది. ఆయా షాపు పరిధిలోకి వచ్చే గ్రామాలకు కొన్ని చోట్ల ప్రత్యేకంగా మనిషిని ఏర్పాటు చేసి సరఫరా చేస్తుండగా, కొన్నిచోట్ల మాత్రం బెల్టు నిర్వాహకులే షాపు వద్దకు వచ్చి తమకు కావాల్సిన బ్రాండ్లను తీసుకెళ్తున్నారు. కొన్ని గ్రామాల్లో చిల్లర దుకాణంలో నిర్వహిస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో నాటుసారా విక్రయించే వారు ఇంట్లో పెట్టుకుని మందు ప్రియులకు రహస్యంగా చేరుస్తున్నారు. పట్టణాల్లో షాపునకు అనుబంధంగా, అక్కడ అవకాశం లేకుంటే కొంతదూరంలోనో, ఎదురుగానో రూములు, స్థలాలు తీసుకుని అదనపు ఖర్చు చేసి షెడ్లు నిర్మించారు. పల్లెలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలావుండగా మద్యం దుకాణాలకు అనుబంధంగా అనధికార సిట్టింగ్‌లతో బార్ల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెబుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోకుంటే బార్‌లను మూసేయడమే మేలని, ఫలితంగా బార్ నిర్వహణకు అయ్యే ఖర్చులైనా మిగులుతాయని వారు భావిస్తున్నట్లు వాపోతున్నారు.

సిట్టింగ్ రూములపై చర్యలు

- బీమలింగ, ఎక్సైజ్ సీఐ, మదనపల్లె

మద్యం షాపునకు అనుబంధంగా ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. అలా ఎవరైనా, ఎక్కడైనా అనధికారికంగా నిర్వహిస్తుంటే చట్టవిరుద్ధం. అది నేరం కూడా. అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటాం. తాము ఏ దుకాణదారుని నుంచీ డబ్బులు తీసుకోలేదు.


రోడ్డుపై తాగుతున్న మద్యం ప్రియులు


సిట్టింగ్ హాలులో మద్యం ప్రియులు


చిల్లర దుకాణానికి అనుబంధంగా నడుస్తున్న బెల్టుషాపు

భూతగాదాలతో రైతు ఆత్మహత్య...!

- జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా


మార్కెట్‌యార్డు వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు


మృతుడు రామకృష్ణారెడ్డి (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలతో ఓ రైతు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన తలారివాండ్లపల్లె వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెకు చెందిన రేగంటి రామకృష్ణారెడ్డి(50)కి అదే గ్రామానికి చెందిన సి.రమణారెడ్డి కుటుంబానికి కొన్నేళ్లుగా భూతగాదాలున్నాయి. ఈ క్రమంలో పదిహేను రోజుల క్రితం భూముల విషయమై గొడవపడి కేసులు పెట్టుకున్నారు. రామకృష్ణారెడ్డి(50)ను చంపుతానంటూ పలుమార్లు రమణారెడ్డి బెదిరించినట్లు మృతుడి భార్య అమృత తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకొని మృతి చెందాడు. కాగా పొలం వద్దకు వెళ్లిన భర్త ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో ఉదయం పొలం వద్ద కుటుంబ సభ్యులు చూడగా ఉరేసుకొని వేలాడుతున్నట్లు తెలిపారు. విషయాన్ని పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా భూతగాదాలతో తన భర్త చనిపోయేందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ భార్య కుటుంబ సభ్యులతో కలిసి గుర్రంకొండ-బెంగుళూరు జాతీయ రహదారిపై మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేశారు. తప్పుడు రెవెన్యూ రికార్డులను సృష్టించి గ్రామస్థులను ఇబ్బంది పెడుతున్న రమణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ మధురామచంద్రుడు బాధితులకు సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా.. తలారివాండ్లపల్లెలో రమణారెడ్డి కుటుంబానికి, రేగంటి రెడ్డెప్ప కుమారులకు భూ సమస్యలున్నాయి. ఈ భూముల సమస్యలపై ఇరువర్గాల వారు కోర్టును ఆశ్రయించారు. కేసులు నడుస్తున్నాయి. రెవెన్యూ రికార్డులను పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు రూ.18.70 కోట్లు

మదనపల్లె, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పనుల బిల్లులు రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 2014 నుంచి 2019 వరకూ చేపట్టిన పనుల్లో 265 పనులకు సంబంధించి రూ.18.70 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. భూగర్భజలాలను వృద్ధి చేసే క్రమంలో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు నీరు-చెట్టు పనులు చేపట్టారు. మొదట్లో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాగా, ఎన్నికల ముందు 2018-19లో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడింది. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో నీరు-చెట్టు పనులను నిలిపేశారు. ఈ నేపథ్యంలో చాలామంది కోర్టును ఆశ్రయించినా.. కొందరికి మినహా అందరికీ చెల్లించలేదు. తిరిగి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు రేకెత్తాయి.

కల నెరవేరేనా..!


పుష్కలంగా నీరు ఉన్న వెలిగల్లు ప్రాజెక్టు

దేశానికి రైతే వెన్నెముక. రైతన్నలు పండించే పంటలతోనే దేశం సుభిక్షంగా ఉంటుంది. కానీ గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వ్యవసాయానికి కావాల్సిన నీరు అందించడంలో విఫలమైంది. చేసేదేమీ లేక.. వ్యవసాయంపై మక్కువ చంపుకోలేక.. రైతులే లక్షలు వెచ్చించి బోరుబావులు వేసినా నీటిజాడే కనిపించడం లేదు. వెయ్యి అడుగులు వేసినా నీటిచుక్క లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 25 వేల ఎకరాల సాగు భూమి ఉంది. కూటమి ప్రభుత్వంలోనైనా వెలిగల్లు ద్వారా నీటిని అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం
- వెయ్యి అడుగులు వేసినా జాడలేని నీటి చుక్క
- ఎడారిని తలపిస్తున్న వేలాది ఎకరాల వ్యవసాయ భూములు
- నీళ్లు లేక ఎండిపోతున్న మామిడి తోటలు
- ‘కూటమి’లోనైనా వెలిగల్లు ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించేనా ?

గాలివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత 5 సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో మండల ప్రజలకు తాగు, సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైంది. వెలిగల్లు ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ వీటిని చెరువులకు, కుంటలకు, భూములకు నీరు అందించలేని దుస్థితిలో అప్పటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కరువు కాటకాలకు నిలయమైన ఈ ప్రాంతం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించాలని రైతులు అప్పటి ప్రజాప్రతినిధుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా వారు పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు నీరు నింపి ఉంటే ఈ రోజు వ్యవసాయంతో పాటు మామిడి తోటలను కూడా కాపాడుకొనేవారమని రైతులు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన నిర్లక్ష్యం వలన మండల రైతాంగానికి శాపంగా మారింది. మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 25 వేల ఎకరాల సాగు భూమి కలదు. అన్ని పంచాయతీల్లో 200 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. వెలిగల్లు, కుషావతి ప్రాజెక్టుల ద్వారా 6 పంచాయతీల్లో 7 వేల ఎకరాల వరకు సాగు భూమి, మిగిలిన 18 వేల ఎకరాల వ్యవసాయ భూములు వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్నారు. వీటితో పాటు మరో 2 వేల ఎకరాలకు పైగా మామిడి, జామ, సపోట, అరటి, నిమ్మ వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.


చుక్కనీరు లేక బోసిపోయిన మొరగలచెరువు

కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో పాపాఘ్ని నదిపై 4.64 టీఎంసీల నీటి సామర్థ్యంతో వెలిగల్లు ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా 24 వేల ఎకరాలకు (మూడు మండలాల పరిధిలో) సాగునీరు, రాయచోటి పట్టణానికి తాగునీరు అందిస్తున్నారు. అయితే ప్రాజెక్టు ఉన్న మండలమైన గాలివీడులో మాత్రం రైతాంగానికి, ప్రజలకు సాగు, తాగునీరు అందడం లేదు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గానూ గరుగుపల్లి, పందికుంట, తూముకుంట, కొర్లకుంట పంచాయతీల్లో మాత్రమే పూర్తి స్థాయిలో భూములకు సాగునీరు అందుతుండగా గుండ్లచెరువు, పేరంపల్లి, బోరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో 4 వంతుల వ్యవసాయ భూముల్లో ఒక వంతు వ్యవసాయ భూములకు నీరు సౌకర్యం అందుతోంది. మిగిలిన 10 పంచాయతీల్లోనూ వ్యవసాయ భూములకు ఒక చుక్క నీరు కూడా అందలేదు. అయితే ఈ గ్రామాల పరిధిలోని వ్యవసాయ భూములకు వెలిగల్లు ఎత్తిపోతల పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పించలేదు. ముఖ్యంగా చీమలచెరువుపల్లె రెండు వేల ఎకరాలు, నూలివీడు మూడు వేల ఎకరాలు, గోపనపల్లె రెండు వేల ఎకరాలు, ఎగువగొట్టివీడు రెండు వేల ఎకరాలు, గుండ్లచెరువు 1500 ఎకరాలు, గోరాన్‌చెరువు మూడు వేల ఎకరాలు మొత్తం 13,500 ఎకరాలు మెట్ట, మాగాని భూములు కలవు. ఈ గ్రామాల కింద దాదాపుగా 60 వరకు కుంటలు, చెరువులు కలవు. అయితే ఈ గ్రామాల్లో 2 వేల ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. నీటి సౌకర్యం లేకపోవడం వలన వ్యవసాయ భూములన్నీ ఎడారిని తలపిస్తున్నాయి. అయితే మామిడి తోటలను కాపాడుకునేందుకు అప్పులు చేసి ఒక్కో రైతు 5 నుంచి 15 బోర్లు వెయ్యి అడుగుల లోతు వరకు వేసినా నీటి జాడ లేదు. దీంతో రైతులు చేసిన అప్పులు తీర్చుకోలేక కొంత మంది భూములను అమ్ముకుంటుండగా, మరి కొందరు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారు.


ఎండిపోయిన మామిడితోట

2014లో టీడీపీ ప్రభుత్వ కాలంలో వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీటి సౌకర్యానికి వ్యవసాయ భూము లకు నీటిని అందించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ముఖ్యంగా వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ ద్వారా గుండ్లచెరువు పంచాయతీలోని గండిచెరువుకు నీటిని తరలించి అక్కడి నుంచి లిఫ్ట్ ద్వారా కమలా మర్రిలోని పడమటపల్లెకు సమీపంలో ట్యాంక్‌ను ఏర్పాటు చేసి తద్వారా కాలువల ద్వారా వివిధ గ్రామాల్లోని చెరువులకు సాగునీటిని అందించేందుకు పథక రచన చేశారు. కానీ 2019లో ప్రభుత్వం మారిపోవడంతో ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వెలిగల్లు ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించింది. ఈ పథకం గురించి 5 ఏళ్ల కాలంలో ప్రజాప్రతినిధులకు వందసార్లు రైతులు విన్నవించుకున్నప్పటికీ వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పుడు నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా వెలిగల్లు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలి

- వేణుగోపాల్‌రెడ్డి, కుమ్మరపల్లి, నూలివీడు



నాకు 30 ఎకరాల్లో మామిడి తోట, 10 ఎకరాలు మెట్ట, మాగాని భూములు కలవు. ఈ మామిడి తోటలను కాపాడుకునేందుకు వెయ్యి అడుగుల లోతుతో 15 వ్యవసాయ బోర్లు వేశాను. ఒక్కో బోరుకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశాను. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మొత్తం 15 బోర్లకు గానూ కేవలం రెండు బోర్లల్లో మాత్రమే నీళ్లు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వెలిగల్లు ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు నీటిని అందిస్తే మామిడి చెట్లను కాపాడుకోవచ్చు.



ఆత్మస్థైర్యం నింపేందుకు...

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ కార్యక్రమం
- 422 పాఠశాలలో 33,712 మందికి శిక్షణ
- ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు..

కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకు సర్కారు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కరాటేతో పాటు మరికొన్ని సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతోంది. అమ్మాయిలపై దాడుల, అత్యాచారాలు ఎదుర్కోనేందుకు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం పాఠశాలస్థాయి నుంచే ఉచితంగా కరాటే, జూడో వంటి శిక్షణలు ఇవ్వనున్నారు.

రాష్ట్రంలో చదువుతున్న ఆడపిల్లలు సంరక్షణ కోసం ఆత్మరక్షణ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో అమలు చేసేం దుకు రాష్ట్ర విద్యాశాఖ శ్రీకార చుట్టింది. ఇందులో భాగంగా వైఎస్సార్ జిలల్లాలో 422 పాఠశాలల్లోని 33712 మంది బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ చేపట్టనున్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15 వరకు 20 సెక్షన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. ప్రతిరోజు 60 నిమిషాలు ఉంటుంది. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ కూడా విడుదలైంది. బాలికల ఆత్మరక్షణకు సంబంధించి తైక్వాండో, ఉషు, కరాటే, జూడో, వెస్ట్రన్ బాక్సింగ్, కిక్ బాక్సింగ్, రెజ్లింగ్, క్రావ్ మాగా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ), ఐకిడో, జీత్ కునే దో, ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ (కలరిపయట్టు వంటివి)లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆత్మరక్షణ కార్యక్రమం ద్వారా బోధించే కరాటే శిక్షణ బయటి శత్రువులతో పోరాడడమే కాకుండా అంతరంగిక శత్రువులైన కోపం, చిరాకు, జీవితంలో ఎదురయ్యే



సమస్యలను ఆత్మవిశ్వాసంతో తేలికగా పరిష్కరించడం లో సహాయపడుతుంది.

ఆత్మరక్షణ తరగతులు ఎందుకంటే...

ఆత్మరక్షణ తరగతులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని మరియు స్వీయ క్రమశిక్షణను పెంపొందించడానికి.. వారి శారీరక స్థితిని మెరుగుపరచడానికి సహాయపడతాయి. ప్రత్యేకించి తరగతులు ముగిసిన తర్వాత రాత్రిపూట ఒంటరిగా నడుస్తున్నప్పుడు విద్యార్థులకు ఇది సహాయపడుతుంది. స్వీయరక్షణ ప్రాథమికాలను నేర్చుకోవడం ద్వారా ప్రమాదకరమైన మరియు ఊహించలేని పరిస్థితులకు తమను తాము సిద్ధం చేసుకోవడంలో సహాయపడుతుంది. ఇది విద్యార్థులకు ఆత్మగౌరవం గురించి బోధిస్తుంది. స్వీయ రక్షణ తరగతులు ఆత్మగౌరవం, భయాన్ని అధిగమించడం, అవగాహన/హెచ్చరిక మరియు స్వీయ గౌరవం వంటి అనేక మానవ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఆత్మరక్షణ తరగతులు తీసుకోవడం విద్యార్థులకు ఒక విధమైన యోధుల స్ఫూర్తిని పెంపొందించడానికి సహాయపడుతుంది.

శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు...

పాఠశాలల్లో ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని రాష్ట్రంలోని జిల్లా విద్యా అధికారులు, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కోఆర్డినేటర్లు, సమగ్ర శిక్ష అదనపుప్రాజెక్టు కోఆర్డినేటర్‌లకు సూచించింది. ఈ మేరకు శిక్షకులు తప్పనిసరిగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మార్షల్ ఆర్ట్స్‌లో అర్హత మరియు అనుభవం కలిగి ఉండాలి. జిల్లా స్థాయిలో వీరిని కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేస్తుంది. శిక్షణ పారితోషికం రూ.10వేలు చెల్లిస్తారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీయూపీలు, జడ్పీహెచ్ఎస్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, మున్సిపల్, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో నైపుణ్యం కలిగిన సమర్థ ఏజెన్సీలను ఆకర్షించడానికి విస్తృత ప్రచారం ఈ సందర్భంగా చేయాల్సి ఉంటుంది.

స్త్రీలనే శిక్షకులుగా నియమించాలి



బాలికలు స్వేచ్ఛగా తిరిగేందుకు ప్రభుత్వం కల్పించిన శిక్షణ పట్ల హర్షనీయం. అయితే బాలికలకు ఇచ్చే ఆత్మరక్షణ శిక్షకులుగా మహిళలను నియమించాలి. ప్రతిరోజు ఉదయం నాలుగవ పీరియడ్‌ను శిక్షణకు కేటాయించాలి. కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రత్యేక దుస్తులను ప్రభుత్వం సరఫరా చేయాలి.

-సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి చేరే మార్గం నైపుణ్యం

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు

కడప ఎడ్యుకేషన్, నవరి 31 (ఆంధ్రజ్యోతి): మనిషి మెదడుకు పది వేల కోట్ల కంప్యూటర్ శక్తి ఉంది.. మీలో నిగూఢంగా ఉన్న శక్తిని తెలుసుకోండి.. విశ్వసించండి.. మీరేం కావాలనుకుంటున్నారో నిర్ణయించుకొని జ్ఞాన దీపాన్ని వెలిగించండి.. మీ జీవితాలతో పాటు సమాజంలోని వారికి వెలుగునివ్వండి అని హైదరాబాద్ వర్లూస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సక్సెస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు అన్నారు. శుక్రవారం వైవీయూ ఏపీజే అబ్దుల్ కలాం ప్రాంగణంలో మానసిక వికాస ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్లు మాట్లాడుతూ జ్ఞానాన్ని ఉపయోగించుకున్న వారే గొప్పవారుగా నిలుస్తారన్నారు. సమాజం గుర్తించి అభిమానించి గౌరవించాలంటే మన చేతుల్లోనే ఉందన్నారు. కాలయాపన లేకుండా కార్యోన్ముకులు కావాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రశ్న లేకపోతే ప్రగతి ఉండదన్నారు. యువతలో ఎక్కువ భాగం తాము ఏమీ కావాలనుకుంటున్నారో తెలియదని.. అందరూ చదువుతున్నారు కదా అని చదువుతారని.. దీని వల్ల నిర్ణీత వయసు వచ్చాక స్థిరపడలేకపోతారన్నారు. చిన్న వయసులో ఒక బలమైన నిర్ణయం తీసుకొని అమలు చేసేందుకు ప్రయత్నించాలన్నారు. విద్య ద్వారానే గొప్పవారవుతామని సత్యనాదెళ్ల, అబ్దుల్ కలాం జీవిత విశేషాలను వివరించారు. మనతో పాటు ఉన్న వారి కంటే మనం రెండు గంటలు అదనంగా ప్రయత్నిస్తే చేస్తున్న పనిలో ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. సెల్‌ఫోన్‌లలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్ వంటివి కాలహరణ చేస్తాయని, ప్రేమలు సినిమాల్లోనే సక్సెస్ అవుతాయని నిజజీవితంలో కాదన్నారు. ఈ ప్రకృతి అందరికి ఒకే మెదడు ఇచ్చిందని దాని శక్తి తెలియక మనం ఉన్నస్థితిలోనే ఉండిపోతున్నామని.. మైండ్ ను వినియోగించుకున్నవారే ఉన్నత స్థితికి చేరుతారన్నారు. ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేందుకు సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శాశ్వత ప్రయోజనాలు, ఉజ్వల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు. ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో సహ అచార్యులు డాక్టర్ అనూ ప్రసన్న, జర్నలిజంశాఖ అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు

ఆటో బోల్తా... వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగూడూరు సమీపంలోని లింకురోడ్డు వద్ద గురువారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో వేల్పుల సుబ్బరాయుడు (28) అనే వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించిన వారి బంధువులకు సమాచారం అందించారు. పోలీసులకు విషయం తెలియడంతో సంఘ టనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లె సమీపంలోని గుండావారిపల్లె వద్ద నాలుగు లైన్లు జాతీయ రహదారి బ్రిడ్జి కింద ఐచర్ వాహనం బైకును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కురబలకోట మండలం నడింపల్లెకు చెందిన కార్తీక్(23) అక్కడికక్కడే మృతి చెందగా సీటీఎం రెగంటివారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం(40) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

'దళిత ఎంపీడీవోపై కక్ష సాధింపు తగదు'

గాలివీడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దళిత ఎంపీడీవోపై దాడి చేయడమే కాకుండా మండల పరిషత్ సమావేశంలో నిందలు వేయడం సమంజసం కాదని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్ర బాబు, సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజులు విమర్శించారు. శుక్రవారం గాలివీడులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఎంపీటీసీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత డిసెం బర్ 27న విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేశా రన్నారు. దీంతో పలువురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులపై కేసులు నమోదైన విషయం తెలిసిందేనన్నారు. ప్రస్తుతం ఉన్న ఎంపీ టీసీ సభ్యులను ప్రజలు ఎన్నుకోలేదని, అప్పట్లో టీడీపీ నాయకులపై కేసులు, బిల్లుల చెల్లింపులపై బెదిరింపులతో అప్రజాస్వామికంగా ఎంపిక అయ్యారని తెలిపారు. నిజంగా వారికి నైతిక విలువలు ఉంటే వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఎంపీడీవోపై దాడి చేసిన వారికి సాక్షాత్తూ మండల పరిషత్ అధ్యక్షురాలు వత్తాసు పలకడం, మండల సమావేశంలో నిందితులు కోర్టు పరిధిలోని అంశాలు చర్చించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాజీ లేని పోరు సాగిస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలు సుమారు 25వేల కోట్లు ఉంటే కూటమి ప్రభుత్వం కేవలం 13 కోట్లు తూతూ మంత్రంగా విడుదల చేయడం సరి కాదన్నారు. కొండంత బకాయిలు ఉన్నప్పటికీ గోరంత విడుదల చేస్తూ అసత్య ప్రచారం చేసుకోవడం విచాకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల సమ్యస్యల గురించి ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేవారన్నారు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి పలికి ఉద్యోగుల న్యాయమైన సమస్యలను కూడా పక్కన పెట్టేశారని ఆరోపించారు. టీడీపీ అ ధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంత వరకు ఉద్యోగుల సమస్యల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు రావాలసిన ఐఆర్, పీఆర్సీ ఊసే ఎత్తడం లేదన్నారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థను హేతుబద్దం చేస్తున్నామనే సాకుతో ఉద్యోగుల సంఖ్యను కుదించి పనిబారం పెంచడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థను గురించి ఒక కమిటీ వేసి తద్వారా హేతుబద్ధీకరణ చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగుల ను ఏకం చేసి పాలక ప్రభుత్వంపై పోరు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు లెక్కల జమాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకర్ల వెంకట్రామిరెడ్డి

ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు ఏర్పాటు

వేంపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు నాలుగు నెలల తర్వాత ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఉన్న క్యాంటీన్లను మూసేశారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ద్వారా అధికారులు డ్వాక్రా గ్రూపులకు కేటాయించారు. తమకే కావాలని టీడీపీలో ఉన్న ప్రధాన నాయకులు పట్టుబట్టడం, నిబంధనల ప్రకారం కేటాయించాలని, లేకుంటే తమ వారికి ఒకటి ఇవ్వాలని వైసీపీ ముఖ్యనేత పట్టుబట్టడంతో ట్రిపుల్ ఐటీ అధికారులకు తలనొప్పిగా మారింది. దీంతో క్యాంటీన్ల వ్యవహారాన్ని కలెక్టర్‌కు పంపారు. దీంతో నాలుగు నెలలు జాప్యం కాగా ట్రిపుల్‌ఐటీలో ఉన్న వేలాది మంది విద్యార్థులు బయటి ఫుడ్ కోసం ఎగబడ్డారు. క్యాంటీన్లు లేక ఇబ్బంది పడ్డారు. శుక్రవారం బాలుర హాస్టల్‌లో ఒక క్యాంటీన్, బాలికల హాస్టల్‌లో మరో క్యాంటీన్‌ను ప్రారంభించారు. దీనితో క్యాంటీన్లు రద్దీగా కనిపించాయి.

క్రమశిక్షణతో విధులు నిర్వహించండి : అదనపు ఎస్పీ

కడప క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు పిలుపునిచ్చారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన మొబిలైజేషన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. స్థానిక పోలీసుపరేడ్ మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఏఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పరిశీలన వాహనంపై వెళ్లి ఏఆర్ ప్లటూనను పరిశీలించి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోనే జిల్లా పోలీసులకు మంచి పేరుందన్నారు. ఏఆర్ సిబ్బందికి ప్రతి ఏటా మొబిలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. డీ మొబిలైజేషన్ పరేడ్‌ను క్రమశిక్షణతో అద్భుతంగా చేశారని పరేడ్ కమాండర్ వీరేశ్‌ను భినందించారు. అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. మొబిలైజేషన్‌లో ఫైరింగ్, టర్న్ అవుట్ అండ్ ప్రొఫిషియెన్సీ పే టెస్ట్, డ్రైవింగ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శివరాముడు, టైటస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

ఘనంగా పారువేట

లక్కిరెడ్డిపల్లె జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మ జాతర సందర్భంగా శుక్రవారం పారువేట నిర్వహించారు. ప్రతి ఏటా లాగే పుష్యమాసంలో వచ్చే చొల్లంగి అమవాస్య తరువాత పాడ్యమినాడు యాదవ సామాజిక వర్గానికి చెందిన పూజారులు గొల్లపల్లెలోని అమ్మవారి ఇంటి నుంచి వేయి కనులచీర, జాకెట్, వెండికళ్లు, కోరలు, అమ్మవారి చిత్రకన్నును చెల్లు వంశీయులు బ్యాండ్ వాయిద్యాల మధ్య తీసుకువచ్చి గంగమ్మ దేవాలయంలో అప్పగించారు. శుక్రవారం తెల్లవారు జామున ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గొర్రెను బలి ఇచ్చి పూజలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ రవీంద్రబాబు బందో బస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అమ్మవారి పూజారులు గంగరాజుయాదవ్, దినేష్‌యాదవ్ పాల్గొన్నారు.





అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



చెల్లు వంశీయుల ఇంటి నుంచి అమ్మవారికి వేయి కనుల చీర తీసుకెళుతున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



ఆజాద్‌నగర్‌లో ప్రజలకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు, వైద్య సిబ్బంది

సికెదిన్నె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధులు రాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లోని చౌడేశ్వరీనగర్‌లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీటితొట్లు, పూలకుండీలు, కూలర్లు, తాగి పడేసే కొబ్బరి బోండాలలో నీరు నిలువ ఉన్నట్లయితే దోమల లార్వాలు పెరిగి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ఇళ్లలో నీరు నిలువ ఉంచుకునే పాత్రలను వారానికి ఒకసారి శుభ్రపరచి వెంటనే ఆరబెట్టాలన్నారు. దీని ద్వారా దోమల లార్వా పెరుగకుండా వాటి ఉత్పత్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాఘవేంద్ర, సీహెచ్‌వో సుకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించి క్యాన్సర్‌ను దూరం చేద్దాం



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సూత్రాలు పాటించి అప్రమత్తంగా ఉంటే క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలను నివారించవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వరల్డ్ సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసం సందర్భంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై యోగివేమన యూనివర్సిటీ మహిళల వసతి గృహం విద్యార్థినులకు ఎన్ఎస్ఎస్ పీఓ ఆచార్య అనిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రయోజనార్థం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పుత్తా పద్మ ఆరోగ్య సూత్రాలు తెలిపారు. ప్రముఖ స్త్రీవ్యాధి నిపుణులు డాక్టర్ వై.ప్రమోదరెడ్డి మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే అవకాశాలను, ముందుగా గుర్తించే విధానాలను, చికిత్స పద్ధతులను విశదీకరించారు. అలాగే సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నివారించడానికి ఉన్న వ్యాక్సిన్ (హెచ్‌పీవీ) గురించి, ఎన్ని దశలలో వేయించుకోవాలో వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకటరామిరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, ఆచార్య మెర్సీ విజేత విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గృహహింస విభాగంలో కడపలో ఖాళీగా ఉన్న సోషల్ కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టీటీపీఎస్://కడప.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా అర్హతలు, పోస్టుకు సంబంధించిన వివరాలు పొందవచ్చని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 1 నుంచి 15వ తేదీలోపు కార్యాలయ పనిదినాలలో జిల్లా స్త్రీ శిశు సంక్షే మ, సాధికార అధికారి, డి బ్లాక్ కొత్త కలెక్టరేట్ కడప, వైఎస్సార్ జిల్లా అనే చిరునామాలో సమర్పించాలని సూచించారు. అన్ని ధ్రువీకరణ పత్రాలతో సమగ్రంగా ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ముగిసిన నల్లనమ్మ పంచమ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న నల్లనమ్మ అమ్మవారు

వీరపునాయునిపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కీర్తిపల్లె గ్రామంలో ఉన్న నల్లనమ్మ ఆలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న పంచమ వార్షికోత్సవం ఘనంగా ముగిసింది. ఉదయం 6 నుంచి అమ్మవారికి పురోహితులచే ప్రత్యేక పూజలు జరిపించారు. అభిషేకాలు, కుంకుమార్చన, గణపత రుద్రా, లక్ష్మీనారాయణ రుద్ర, లక్ష్మీ కుబేర వాస్తు మన్య అమ్మవారి మూలమంత్రంలో ఆయుష్య హోమంలో పూర్ణాహంతి కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 10గంటలకు గ్రామంలో ఉన్న ప్రతి కుటుంబం నుంచి మంగళవాయిద్యాలతో అమ్మవారినామస్మరణంతో మహిళా భక్తులు బోణాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు రామిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన కేటగిరీ వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించారు.

రెండో రోజూ కొనసాగిన సీపీఎం జీపు జాతా


కార్యక్రమంలో మాట్లాడుతున్న రామ్మోహన్

కడప సెవెన్ రోడ్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విభజన హామీలను అమలు చేయాలని కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ పనులు ప్రారంభించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా రెండవ రోజు కడప నగరంలో జిల్లా పరిషత్ నుంచి ప్రారంభమైంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని, కడప ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభలలో ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం తీర్మానం చేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ స్థలాలపై మరింత విచారణ చేపట్టాలి

చెన్నూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు, రుద్రభారతిపేటలో ప్రభుత్వ స్థలాలపై విచారణ చేపట్టాలని టీడీపీ నేత, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. చెన్నూరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ చెన్నూరు కొత్తగాంధీనగర్‌లోని అంగన్వాడీ కేంద్రం, రుద్రభారతి పేటలో బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు సృష్టించి స్థలాలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పక్కాగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆక్రమణ దారులను రెవెన్యూ అధికారులు ఏ మాత్రం ఉపేక్షించరాదని, వీటిపై సమగ్ర విచారణ జరిపిస్తే బోగస్ పొజిషన్ సర్టిఫికెట్లు తయారు చేసేవారెవరో బయటికి వస్తారన్నారు.

మానవతకు బాడీ ఫ్రీజర్ వితరణ


మానవతకు బాడీ ఫ్రీజర్‌ను అందిస్తున్న దాతలు

వేంపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మానవత స్వచ్ఛంద సంస్థకు మరో బాడీ ఫ్రీజర్ అందుబాటులోకి వచ్చింది. మేడా వెంకట వీరబ్రహ్మం మేనమామ నరసింహులు జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్‌ను శుక్రవారం మానవత సంస్థకు అప్పగించారు. సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, పోతిరెడ్డి శ్రావణ్‌కుమార్, కృష్ణతేజ తదితరులకు బాడీ ఫ్రీజర్‌ను అప్పగించారు. అంతిమ సంస్కారంలో ఉపయోగపడే బాడీ ఫ్రీజర్ విరాళంగా ఇవ్వడం అభినందనీయమని వితరణ చేసిన వారిని సత్కరించి మెమెంటో అందించారు. యోగీశ్వర్‌బాబు, సుభాష్, అరుణ్, డాక్టర్ రంగయ్య, రాజారామ్, ఇడుపులపాయ గోపి, చల్లా బాలాజి, గండి మాజీ చైర్మన్ రాజన్న, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీల పక్షపాతి వైఎస్ జగన్'

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మైనార్టీల పక్షపాతి అని వైసీపీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు ఎస్ఎండీ షఫీ తెలిపారు. శుక్రవారం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కడప హజ్ హౌస్‌కు రూ.10కోట్లు కేటాయించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాకే దక్కుతుందన్నారు.

కార్మిక, కర్షక పక్షపాతి సుబ్బన్న: సీపీఐ


కె.సుబ్బన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తదితరులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక పక్షపాతి కె.సుబ్బన్న అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కామ్రేడ్ కె.సుబ్బన్న 18వ వర్ధంతి సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయంలో సుబ్బన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ జీవితాంతం కార్మికులు, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టుగా, పీడిత జనపోరాట యోధుడిగా సుబ్బన్న చరిత్రలో చిరస్థాయిగా నిలిచారన్నారు. అలంఖాన్‌పల్లెలో పెత్తందారీ తనానికి వ్యతిరేకంగా, ఎస్సీ కాలనీ నిర్మాణం లోను, దండు, యానాది కాలనీ స్థాపించడంలోను, ఎర్రగుంట్ల సిమెంట్ ఫ్యాక్టరీలో, మంగలంపేట బైరటీస్ గనుల్లో, ఆర్టీసీలో ఏఐటీయూసీ కార్మిక సంఘం నిర్మాణం చేయడంలో, గండికోట ప్రాజెక్టు సాధనకు ఆమరణ దీక్ష చేసిన వారిలో ఒకడిగా ఉన్నారన్నారు. రామనపల్లెలో దళితులకు అండగా క్రియాశీలక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. నేటి యువతరం నాటి త్యాగధనుల ఆశయాలను అందిపుచ్చుకొని ప్రజాపోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు




పులివెందుల: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత... కడప: నగరంలో క్షీర కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న ఆర్యవైశ్యులు

కడప కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినం సందర్భంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలోని అమ్మవారిశాల వీధిలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో పూజలు చేశారు. రెండో రోజైన శుక్రవారం నగరంలోని వైవీచలం వీధిలోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం నుంచి 102 క్షీర కలశాలతో ఉభయదారులతో ఊరేగింపుగా శ్రీరాములవీధి గుండా వాసవీ కన్యకాపరమేశ్వరికి పంచామృతాభిషేకం చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బెస్తవేముల రాంమహేశ్, పుల్లయ తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో...

పులివెందుల పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు వారి కుటుంబ సభ్యులు పూర్ణ కలశంతో స్వాగతం పలికారు. అనంతరం వాసవీ మాత ఆత్మార్పణ హోమగుండం ప్రారంభించారు. అమ్మవారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పులివెందుల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేసు శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ మేడం దినేష్ కుమార్, వాసవీ క్లబ్ రీజన్ చైర్మన్ దిండుకుర్తి నాగభూషణం పాల్గొన్నారు.

వేంపల్లెలో...

స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవి మాతకు పంచామృతాభిషేకం,కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించామన్నారు. 15 మంది కన్యకలకు మహిళలకు మంగళస్నానాలు చేయించి తాంబూలాలు అందించారు. మహిళలు అగ్నిగుండంలో గుండ ప్రవేశం చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు.



'గ్రామ పంచాయతీ అధికారాలను కాపాడండి'

కడప రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అధికారలను కాపాడాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 లోని 121 విభాగం మేరకు గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా గ్రామ పంచాయతీ అనుమతి కావాలన్నారు. అలాగే 443 జీవో ప్రకారం 300 చదరపు మీటర్ల విస్తీర్ణం వరకు ఉన్న భవన నిర్మాణాలకు కూడా గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరి అన్నారు. కానీ భవన నిర్మాణ ప్లానులను తయారు చేసే సివిల్ ఇంజనీర్లు(ఎల్‌టీపీ), పంచాయతీ కార్యదర్శులు కలిసి గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా పనులను మంజూరు చేస్తున్నారన్నారు. కావున పంచాయతీ కార్యదర్శులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

వల్లూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొల్ల ఓబాయపల్లె కోదండ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు గోపూజతో ప్రారంభమయ్యాయి. అనంతరం ధ్వజస్తంభానికి పంచామృతాభిషేకాలతో పూజ లు చేశారు. అగ్ని ప్రతిష్ఠ చేసి హోమాలను నిర్వహించారు. మహా మంగళ భహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్ష : ఎంవీఐ


సమావేశంలో మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బీవీ ప్రసాద్

పులివెందుల టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ద్విచక్ర వాహనదారులకు రక్ష అని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బీవీ ప్రసాద్ తెలిపారు. బాలికల కళాశాలలో శుక్రవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు.తప్పకుండా ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని నిబంధనలు అతిక్రమించరాదన్నారు.

మీ సేవలు చిరస్మరణీయం

●అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు


పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న ప్రకాశ్ బాబు, పోలీసు అధికారుల సంఘం నేతలు

కడప క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు దాదాపు 35 సంవత్సరాల పాటు అంకితభావంతో అందించిన మీ సేవలు చిరస్మరణీయమని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు అన్నారు. ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జనవరి నెలాఖరున పదవీ విరమణ పొందిన డీఏఆర్ ఆర్ఎస్ఐ డీవీ సుబ్బారెడ్డి, చిన్నచౌకు హెచ్‌సీ పీఎస్ ఎస్‌కే దాదావలిలను ఆయన సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) బి.రమణయ్య, ఈపీవో ఏవో జ్యోతి, ఆర్ఐలు టైటస్, శివరాముడు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

కడప(వినాయకనగర్), జనవరి31(ఆంధ్రజ్యోతి): మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనమందరం ఆరోగ్యంటా ఉంటామని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. మన కడప- స్వచ్ఛ కడప కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని బిల్టప్ సర్కిల్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. చెత్తను మురికి కాలువల్లో వేయకుండా చెత్త వాహనాలకు అందించాలని పేర్కొన్నారు.

వీధిబాలల విద్యను ప్రోత్సహించాలి

కడప రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : వీధిబాలల విద్యను ప్రోత్సహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. నగరంలోని బాలుర వసతి గృహంలో శుక్రవారం అంతర్జాతీయ వీధిబాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024 ను తీసుకొచ్చిందన్నారు. పిల్లలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. పిల్లల ఆరోగ్య విషయాలపట్ల తగు జాగ్రత్తలను వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ పి.వీరయ్య, డిస్టిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ పి.చెన్నారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వి.వి. సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం పుణ్యకార్యం

కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రక్తదానం పుణ్యకార్యమని యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం జేబీవీఎస్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి మణికంఠ మాట్లాడుతూ రక్తదానం గొప్ప వరమన్నారు. జిల్లాలోని యువత సేవాభావం కలిగి ఉండాలన్నారు. సేవా సమితి వ్యవస్థాపకుడు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ అయిన అశోక్ మాట్లాడుతూ ఒకరి రక్తదానం వల్ల ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు అశోక్ 11వసారి రక్తదానం చేశారు.

వైసీపీ ప్రజల పక్షమా.. రియల్ ఎస్టేట్ మాఫియా పక్షమా?

●ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రజల పక్షమా.. లేక రియల్ ఎస్టేట్ మాఫియా పక్షమా? అనే స్పష్టం చేయాలని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బుద్ద రియల్ ఎస్టేట్ నూటికి నూరు పాళ్లు మోసమన్నారు. చాలా రోజుల తరువాత ప్రస్తుత కలెక్టరు ఆదేశాల మేరకు ఎన్‌హెచ్ అధికారులు ఆ రోడ్డుపై గోడ కట్టడాన్ని హర్షిసున్నానమన్నారు. అయితే వైసీపీ నాయకులు బుద్ద రియల్ ఎస్టేట్, భావన టౌన్ షిప్‌కు అనుకూలంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భావన టౌన్‌షిప్‌లో అక్రమాలపై శుక్రవారం కలెక్టర్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆర్సీపీ నగర కార్యదర్శి మగ్బుల్ బాషా, టీడీపీ చింతకొమ్మదిన్నె నాయకులు కృష్ణారెడ్డి, గంధం మోహన్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప(వినాయకనగర్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన 28వ మహాసభల్లో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెనలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. అనంతపురంలో చరణ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే ఇంతవరకు ఎలాంటి విచారణ చేపట్టలేదన్నారు. కావున విద్యా సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి, నాయకులు రాజశేఖర్, అజయ్, అభినయ్, సుమంత్, మోహన్, వంశీ, వినోద్, ఉదయ్, శివ, రాజేశ్, ఆసీఫ్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

'ఫీజు పోరు చేసే అర్హత వైసీపీకి లేదు'

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫీజుపోరు చేసే అర్హత వైసీపీకి లేదని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరి లోకేష్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం మాసాపేట టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో విద్యార్థుల తరపున పూర్తిఫీజులు నేరుగా కళాశాల యాజమాన్యాలకే ప్రభుత్వం అందజేసిందని, కానీ జగన్‌రెడ్డి మాత్రం ప్రచార్భాటంతో విద్యాదీవెన అంటూ విద్యార్థుల్ని, వారి తల్లిదండ్రుల్ని మోసం చేశారని పేర్కొన్నారు.

సమాజ సేవకుడికి సన్మానం

కడప మారుతీనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని ఆజాద్‌నగర్‌లో గల బృంద వృద్ధాశ్రమం 10వ వార్షికోత్సవం సందర్భంగా సమాజ సేవకుడు గుండ్లకొండ రవికి శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్టెప్ సీఈవో సాయిగ్రేస్, పోరుమామిళ్ల రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి హాజరై ఆయన్ను సన్మానించారు. రవి ఆర్టీసీలో విజిలెన్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే అనాథలకు అంత్యక్రియలు, రక్తదానం చేయడం లాంటివి చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కమలాపురం రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామ సమీపాన ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకరు ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని హుటాహుటిన 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా క్షతగాత్రులు పందిళ్లపల్లె గ్రామానికి చెందిన నవీన్, హేమలత, లక్ష్మీకుమారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

దోమలు కుట్టకుండా చూసుకోవాలి

పెండ్లిమర్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరు రాత్రిపూట దోమ తెరలు వాడాలని కడప మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మీరెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఆలయన మనునూరు గ్రామంలో పర్యటించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో దోమ లార్వాని నిర్మూలన చేసే ఆయిల్ బాల్స్‌ని వదిలారు.

'ఉక్కు సాధన దీక్షను జయప్రదం చేయండి'

కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉక్కు సాధన కోసం ఫిబ్రవరి 10, 11 తేదీలలో 48 గంటల పాటు చేపట్టనున్న దీక్షను జయప్రదం చేయాలని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ప్రదీప్‌రెడ్డి, జయవర్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరంలోని ఓంశాంతినగర్‌లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

శనగ పంటకోత ప్రయోగం

పెండ్లిమర్రి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంరాజపల్లె, కొనాయపల్లె గ్రామాలలో శుక్రవారం శనగ కోత ప్రయోగం చేశారు. మండల వ్యవసాయాధికారి ఓబులేసు మాట్లాడుతూ ఈమేరకు ఎకరానికి 2.5క్వింటాళ్ల నుంచి 3.5 క్వింటాల్ వరకు దిగుబడి రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారిణి చిట్టి మరియు రైతులు పాల్గొన్నారు.

'చంద్రబాబు కృషి ప్రశంసనీయం'

సింహాద్రిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని బీసీల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ప్రశంసనీయమని టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లోమడ మురళీమోహన్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి రూ.896 కోట్లు విడుదల చేశారన్నారు. యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు నిధులు విడుదల చేయడం హర్షనీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికి జగన్ నిధులు కేటాయించకుండా కాలయాపన చేశారన్నారు.

బియ్యం వితరణ


బియ్యం ప్యాకెట్లను అందిస్తున్న లయన్ ఖాసీంఖాన్

కడప ఎడ్యుకేషన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో ఈనెల 1,2వ తేదీల్లో జరగబోయే బాల బాలికల బాలోత్సవ భోజన సదుపాయం కోసం శుక్రవారం లయన్ పి.ఖాసీం ఖాన్ 20 ప్యాకెట్ల బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి పౌరులని వారు చిన్న వయసు నుంచే చదువులతో పాటు ఆటపాలలో ముందుండాలని కోరారు.పి.మన్సూర్ అలిఖాన్, కడప బాలోత్సవ కార్యదర్శి గోపాల్, పి.షరీఫ్ ఖాన్, జయ్యద్ మౌలా, జావీద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో వాసవీ అమ్మవారికి చేసిన విశేష పుష్పాలంకరణ

వాసవీ కన్యకకు విశేష పూజలు

ఘనంగా ఆత్మార్పణ దినం ● నిప్పుల గుండం తొక్కిన ఆర్యవైశ్యులు ● పంచామృతాభిషేకాలు చేసిన కన్యకలు



ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు - కలసపాడులో వాసవీ మాత ప్రతిమకు పంచామృతాభిషేకం చేస్తున్న మహిళలు - పోరుమామిళ్లలో నిప్పుల గుండంలో నడుస్తున్న పురోహితులు - అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న బద్వేలు టీడీపీ నియోజకవర్గ నేత రితేష్‌రెడ్డి



ఎర్రగుంట్లలో మూలవిరాట్టుకు వడిబియ్యం కట్టిన దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, మంత్రపుష్పం నిర్వహించారు. అమ్మవారి బంగారు శ్రీచక్ర మేరువుకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి వజ్రకిరీటంతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం 102 మంది ఆర్యవైశ్య కన్యకలు, 102 రంగు రంగుల పూల గంపలతో పురవీధుల్లో ఊరేగించి అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. 102 మంది ఆర్యవైశ్య మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో...

ఎర్రగుంట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వర దేవి ఆత్మార్పణ దినం నిర్వహించారు. ఆర్యవైశ్యులు అమ్మవారికి 102 కలశాలతో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అభిషేకం, కుంకుమార్చన అనంతరం పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి మహిళలు వడి బియ్యం పోశారు.

పోరుమామిళ్లలో....

పోరుమామిళ్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీమాత ఆత్మార్పణ దినం నిర్వహించారు. అమ్మవారిశాలలో అమ్మవారి విగ్రహంతో పురోహితులు, భక్తులు నిప్పులగుండంలో నడిచారు. ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బి.మఠంలో....

బ్రహ్మంగారిమఠం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అధ్యక్షుడు బన్నూరు క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆత్మార్పణ దినం నిర్వహించారు. కలశాలతో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మంగారికి బియ్యం సమర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పరిటాల వెంకటసుబ్బయ్యను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యదర్శి పబ్బతి నాగేశ్వరరావు, కోశాధికారి సుంకు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నేతలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కలసపాడులో...

కలసపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత ఆత్మార్పణ దినం నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్ తెలిపారు. ఆర్యవైశ్య సంఘం భక్తాదులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడు మలిపెద్దు నాగరాజ, పెద్ద శ్రేష్టి భవనాసి యల్లయ్య, మండల సంఘం అధ్యక్షుడు గొంట్ల రామాంజనేయులు, మహిళా మండలి అధ్యక్షురాలు టి.సత్యవతమ్మ పాల్గొన్నారు.

మైదుకూరులో....

మైదుకూరు రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక అమ్మవారిశాలలో వాసవీమాత ఆత్మార్పణ దినం ఆర్యవైశ్యులు ఘనంగా చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచే వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆర్యవైశ్య కన్యకలు అగ్నిగుండలో నడుస్తూ 'వాసవీమాతాకు జై' అంటూ నినాదాలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

బద్వేలులో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

బద్వేలుటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిశాలలో వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినం జరిగింది. ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా చేస్తుందని ప్రకటించడంతో బద్వేలులో అమ్మవారికి టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీల్లో భాగంగా నేడు అమ్మవారి ఆత్మార్పణ దినంలో ప్రభుత్వం పట్టువస్త్రాలను సమర్పించడం సంతోషకరమన్నారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కనమర్లపూటి రామచంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాది ప్రసాద్, నాగభూషణం, కేవీ సుబ్బారావు, నాగరాజ, ఏఓ సుధాకర్‌రెడ్డి, సింగసాని విజయ్‌కుమార్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో....

ఖాజీపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఆర్యవైశ్యులు, టీడీపీ నేతలు అమ్మవారికి ఘనంగా పట్టువస్త్రాలు సమర్పించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు తాతా నరసింహరావు, ఖాజీపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దరిశ గంగిశెట్టి, మండలాధ్యక్షురాలు విజయలక్ష్మి, టీడీపీ నేతలు ఆర్యవైశ్య సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతులను నట్టేట ముంచిన తుఫాన్

రాజుపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఎన్నో ఆశలు పెట్టుకుని శనగపంట సాగు చేసిన రైతన్నలకు దిగుబడి నిరాశనిచ్చింది. పంట కోత ప్రయోగం ద్వారా ఎకరాకు 4.5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఏఓ అమర్‌నాధరెడ్డి తెలిపారు. శుక్రవారం కూలూరు పొలంలో శనగ పంట కోత ప్రయోగం చేశారు. 5.5 మీటర్లలో 2.82 కిలోలు వచ్చిందని, దీని ప్రకారం ఎకరాకు 4.5 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు ఆయన తెలిపారు. దాదాపు మండలంలో 15వేల 492ఎకరాలు ఈ పంట సాగులో ఉంది. రైతన్నలకు ఖర్చు పెరగడంతో సగం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు చర్చించుకుంటున్నారు. ఇన్సూరెన్స్ అధికారి యువతేజ, ప్రతిభ పాల్గొన్నారు.

బద్వేలు చేరిన సీపీఎం జీపుజాత

బద్వేలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలంటూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం చేపట్టిన జీపుజాతా శుక్రవారం బద్వేలుకు చేరుకుంది. స్థానిక సీపీఎం నేతలు స్వాగతం పలికారు. జీపుజాతా బృందాల సభ్యులు అఖిలేష్, మనోహర్ మాట్లాడుతూ గురువారం నుంచి 'కడప ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో జమ్మలమడుగు నుంచి ప్రారంభమైన జీపు జాతా కడప, నంద్యాల జిల్లాలోని ప్రజలను చైతన్య పరుస్తూ శుక్రవారం బద్వేలు చేరుకుందన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సీపీఎం నేతలు చిన్ని, శ్రీను, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

జమ్మలమడుగు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పలు చోరీ కేసుల్లో ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, మైలవరం ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. వారి వివరాల మేరకు మైలవరం మండలంలో మోటారు సైకిళ్లను చోరీ చేసిన నిందితుడు పొన్నతోట మనోహర్, మరొకరిని అరెస్టు చేశామన్నారు. నిందితుడు మైలవరం మండలం దొమ్మరనంద్యాల హరిజనవాడ వాసి. వేపరాల గ్రామంలో పాత పెన్నా బ్రిడ్జి వద్ద పట్టుకుని విచారించామన్నారు. రెండు టీవీఎస్ ఎక్స్‌ఎల్, ఒక హీరో బైక్, గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

సీఎం దృష్టికి తీసుకు వెళ్తా : మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు కడప నుంచి బెంగళూరుకు రైలు మార్గం లేక అవస్థలు పడుతున్నారని, వారి సమస్యను సీఎం దృష్టికి తీసుకుని పోయి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో రూ 3వేల కోట్లతో ప్రారంభించిన కడప- బెంగళూరు రైల్వేలైన్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం వాటాలతో నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైల్వేలైన్ పనులు జరిగాయని, అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులను గాలికి వదిలేసిందన్నారు. కడప తర్వాత ప్రొద్దుటూరు జనాభా, వాణిజ్య పరంగా ఉండడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు బెంగళూరుకు ఎక్కువగా వెళుతుంటారు. రోజు విశాఖపట్నం తిరుమల ఎక్స్ ప్రెస్ రైలు కొండాపురం నుంచి ఖాళీగా పోయే క్రమంలో యర్రగుంట్లలో రెండు నిమిషాలు స్టాపింగ్ చేస్తే నాలుగు నియోజకవర్గాల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పార్లమెంటులో మన రాష్ట్ర ఎంపీలతో ఈ పనులు జరిగేలా రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి త్వరగా ఈ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరతానన్నారు.

'అభివృద్ధికి అధికారులు సహకరించారు'

గోపవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి అధికారులు సహకరించాల్సిన అవసరం ఉందని బద్వేలు ఎమ్మెల్యే సుధ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం సభాభవనంలో నిర్వహించిన మండల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా వ్యవస్థలో ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. అభివృద్ధికి అధికారులు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల అధ్యక్షురాలు ధనలక్ష్మి అన్నారు. మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఎంపీడీఓ రామనాధరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు చేపడుతామన్నారు. ఈఓపీఆర్‌డీ షేక్ హసీన, ఎంఈఓ చెన్నయ్య వ్యవసాయాధికారి రామక్రిష్ణయ్య, పశువైద్యాధికారి క్రిష్ణవేణి, వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాసులు, నాగేంద్ర, లక్ష్మీదేవి, ఎంపీటీసీలు సరస్వతమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

దయాల్‌బాగ్ ప్రదర్శనను ప్రారంభించిన డీఎస్పీ



దయాల్‌బాగ్ ఉత్పత్తులను తిలకిస్తున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలలో ప్రొద్దుటూరు దయాల్‌బాగ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు రూపొందించిన వస్తువుల ప్రదర్శన, అమ్మకాన్ని డీఎస్పీ పుట్టి భావన ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఇతర నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తయారు చేసిన వస్త్రాలు, బెడ్‌షీట్లు, బ్యాగులను ఆమె పరిశీలించారు. అనంతరం డీఎస్పీని కళాశాల సీఈఓ మీరా కొండారెడ్డి ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ద్వారా డైరీల ఆవిష్కరణ

కొండాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా హిందీ ప్రచార సభ (హైదరాబాద్) డైరీలను ఆవిష్కరించినట్లు కొండాపురం హిందీ ప్రచార సభ జనరల్ సెక్రటరీ షేక్ గైబూవల్లి తెలిపారు. గురువారం రాత్రి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో డైరీలను ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. అమరావతిలో హిందీ ప్రచార సభకు ఎకరా స్థలం కేటాయించాలని, రాష్ట్రంలో హిందీ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని వివరించినట్లు ఆయన తెలిపారు.

డ్రాపౌట్స్ పిల్లలు బడిబాట పట్టాలి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాలకార్మికులు, భిక్షాటన చేసే బాలలను గుర్తించి వారిని బడిబాట పట్టేలా చేయడమే లక్ష్యంగా మహిళా పోలీసులు పనిచేయాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం భిక్షాటన చేసే బాలలు, బాలకార్మికులను గుర్తించడానికి నిర్వహించే సర్వేలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో మహిళా పోలీసులతో బాలల పరిరక్షణ విభాగం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ వాత్సల్య పథకం ప్రొటెక్షన్ ఆఫీసర్లు వీరబల్లి కృష్ణప్రతిరూప్, మహేశ్వర, కౌన్సిలింగ్ స్టాఫ్ యూనస్‌బాష, మహిళా పోలీసు సునీత, తదితరులు పాల్గొన్నారు.

10 వేల మూగజీవాలకు మందులు పంపిణీ

చాపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 10 వేలు మూగజీవాలు (మేకలు, గొర్రెలు, దూడలు) నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు చాపాడు పశువైద్య అధికారి మహ్మద్‌గౌస్ పేర్కొన్నారు. 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. వీఎల్‌ఓ వెంకటేశ్వర్లు, జేవీఓ చలపతి, సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాలు పంపిణీ

మైలవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మైలవరం టెక్స్‌టైల్ పార్కులో తాత్కాలిక ప్లాట్ల కేటాయింపు పత్రాలను లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. మైలవరం టెక్స్‌టైల్ పార్కులు హ్యాండ్ లూమ్, పవర్‌లూమ్, గార్మెంట్, డైయింగ్ ప్లాట్లను టెక్స్‌టైల్ పార్కులో 118 ప్లాట్లకు 93 మంది లబ్ధిదారులకు తాత్కాలిక ప్లాట్ల పట్టాల పంపిణీ చేసినట్లు ఏడీ పిచ్చేశ్వరరావు తెలిపారు. 118 ప్లాట్లకు 93 మందికి ఒక్కొక్కరికి 20 నుంచి 30 సెంట్ల వరకు కేటాయించినట్లు తెలిపారు. మూడు నెలల్లోగా అమౌంట్ టెక్స్‌టైల్ పార్కు అకౌంట్‌కు లబ్ధిదారులు జమ చేయాలని లేనిపక్షంలో వారి ప్లాట్లను రద్దు చేస్తారన్నారు.

'అది ప్రభుత్వ భూమే...'

కలసపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చింతలపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడంతో ఖాళీ చేయాలని జనవరి 24న వీఆర్వో, వీఆర్ఏ నోటీసులు జారీ చేశారు. అయితే ప్రభుత్వ భూమిలో గడ్డివాములు, దిబ్బలు వేసుకుని ఉండడంతో దాన్ని ఖాళీ చేయాలని ఆకుల పుల్లయ్యకు నోటీసులు ఇచ్చారు. కాగా అధికారుల వత్తిడి మేరకు పుల్లయ్య మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు చేసిన ఆరోపణలపై ఎలాంటి వాస్తవం లేదని తహసీల్దార్ మధురవాణి ప్రకటనలో తెలిపారు.

ఆక్రమిత భూములను అర్హులకు కేటాయించాలి

బద్వేలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బద్వేలు, గోపవరం మండలాల పరిధిలో ఉన్న ఆక్రమిత భూములను అర్హులైన లబ్ధిదారులకు ఎన్‌టీఆర్ గృహ పథకం కింద పంపిణీ చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్డీఓ చంద్రమోహన్‌కు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేతలు వినతిపత్రం అందించారు. నేతలు చంద్రశేఖర్, జకరయ్య, చంద్రమోహన్‌రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిగారిపల్లెలో లేగదూడల ప్రదర్శన

బద్వేలు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడలు ఆరోగ్యవంతంగా జీవిస్తాయని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పొట్టిగారిపల్లెలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఆరోగ్యంగా ఉండే లేగదూడలకు బహుమతులను అందించారు. ఉపసంచాలకులు డాక్టర్ రమణయ్య, కడప డీఎల్‌డీఏ డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలను వినియోగించుకోండి

బద్వేలు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బద్వేలు ఆర్టీసీ డిపో పరిధిలో ఖాళీగా ఉన్న 22 దుకాణాలను టెండర్ ద్వారా పొంది వినియోగించుకోవాలని ఆర్టీసీ డీఎం నిరంజన్ కోరారు. శుక్రవారం స్థానిక డిపోలో విలేఖరులతో మాట్లాడుతూ డిపో పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ఖాళీగా ఉన్న దుకాణాలను కడప నగరంలోని బీపీటీఓ కార్యాలయంలో టెండర్ నిర్వహిస్తామన్నారు. టెండర్ ద్వారా దుఖాణాలను పొంది వ్యాపారాలను చేసుకోవచ్చన్నారు. డీఎస్ నాయక్, అల్లాబకాష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నంపల్లె చెరువు పరిశీలన

బద్వేలుటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చెన్నంపల్లె చెరువును ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ రమణారెడ్డి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. చెరువులో ఉన్న కంపచెట్లను తొలగించామని, చెరువులపై ప్రత్యేక దృష్టి పెట్టడం, చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈగ సుబ్బారెడ్డి, లకిడి విజయ్, సింగసాని విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

చాపాడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయ రికార్డులను జిల్లా పరిషత్ కార్యాలయ సీఈఓ ఓబులమ్మ పరిశీలించారు. శుక్రవారం డిప్యూటీ డీఈఓ మైథిలి, ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభివృద్ధి పనులను గురించి ఎంపీడీఓ వీరకిశోర్, ఎంఈఓ రవిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్‌గౌస్, ఏపీఓ జగదీష్‌రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిన ఇల్లు

మైదుకూరు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యల్లంపల్లె వాసి ఇమామ్ హుసేన్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. ఇంట్లో వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో వీధిలో నిలబడాల్సి వచ్చింది.

హెల్మెట్ బరువుకాదు... బాధ్యత

బద్వేలుటౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ తప్పనిసరని అధికారులు ఇస్తున్న సూచనలను వాహనదారులు పాటించాలి. లక్షలుపోసి బైకులు కొనడం, వేగంగా వెళడం తప్ప హెల్మెట్ పెట్టుకోవడానికి ఇష్టపడరు, హెల్మెట్ బరువుకాదు, బాధ్యత అని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. చిన్నప్రమాదం జరిగినా హెల్మెట్‌లేకపోతే తలకు తీవ్రగాయాలై క్షతగాత్రులుగా మిగిలిపోయినవారు అనేకం ఉన్నారు. బైక్‌లో వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని, కారునడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని హెచ్చరిస్తున్నారు. కొందరు యువకులు హెల్మెట్, సీటు బెల్టు ధరించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



హెల్మెట్ పెట్టుకుని బైక్‌లో వెళుతున్న దృశ్యం



కారులో సీటు బెల్టు పెట్టుకున్న యువకుడు

హోటల్, లాడ్జి యజమానులకు కౌన్సెలింగ్

ఖాజీపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హోటల్స్ లాడ్జి, డాబా యజమానులకు సీఐ మోహన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్ణీత సమయంలో హోటళ్లు నడుపుకోవాలని, ఇష్టానుసారం నిర్వహించడం, ట్రాఫిక్ అంతరాయం కలిగించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ప్రయాణికుల లక్కీడ్రా

బద్వేలు రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బద్వేలు - కడప రూట్‌లో తిరిగే బస్సుల్లో ప్రయాణికులకు టిక్కెట్లపై గిఫ్ట్‌స్కీం లక్కీడ్రా ఆర్టీసీ డీఎం నిరంజన్ నిర్వహించారు. డ్రాలో ప్రథమ బహుమతి ఆర్‌వీ రమణమ్మ, ద్వితీయ బహుమతి హరీష్, తృతీయ బహుమతి చిన్ని పొందారు. బీఎస్ నాయక్, రవిప్రసాద్, చెంచురెడ్డి, డీఎంఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయం జిల్లాలోనే ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. దస్తగిరిపేటలోని బ్యాంకు వద్ద పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సీమ వ్యాప్తంగా బ్యాంకు పేద ప్రజల ప్రగతికి తోడ్పడిందన్నారు. రైతులకు రుణాలు, డ్వాక్రాకు నిధుల మంజూరు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించిందన్నారు.